క్లుప్తంగా

కొనసాగుతున్న వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ఎర్ర బెల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం మంగళవారం మూడో రోజు కొనసాగింది. గ్రామంలోని 150 నివాసాల్లో 696 మందిని సర్వే చేశారు. ఆరుగురి రక్తం సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. జ్వరం వచ్చిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా : హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ బాలునాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో అంగడిబజార్‌లో 11కేవీ లైన్ మార్పిడి ఉన్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ హాలియా టౌన్ ఫీడర్ కింద విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఫీడర్ పరిధి లోని రెడ్డి కాలనీ, అంగడిబజార్, వీరయ్య నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండద న్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన చీదెళ్ల కళావతి ఇటీవల మరణించింది. కుటుంబ సభ్యులు ఆమె కళ్లను డైమాండ్ నేత్ర నిధికి దానం చేశారు. మంగళవారం ఆమె ఇష్ట బంతి కావడంతో ముందుగా వాసవీ క్లబ్ 104 ఏ రీజియన్–7, కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో కళావతి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం డైమాండ్ నేత్రనిధి ద్వారా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ సామా శ్రీనివాస్, ఐపీసీలు మాశెట్టి శ్రీనివాస్, డైమాండ్ మిట్టపల్లి విజయభాస్కర్‌రావు, మిట్టపల్లి రాణి, మిట్టపల్లి ప్రశాంత్, ఉన్నారు.

బస్సుపాస్‌లు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తుంగపాడులో గల ఆదర్శ పాఠశాలలో మంగళవారం మిర్యాలగూడ లయన్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ భాస్కర ఆధ్వర్యంలో బాబుసాయిపేటకు చెందిన 63మంది విద్యార్థులకు బస్సుపాస్‌లతో పాటు పెన్నులు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యనగండ్ల లింగయ్య, కోశాధికారి బీఎం నాయుడు, ఏచూరి మురారి, భాగ్యలక్ష్మి, కర్ర రామిరెడ్డి, సామ, శ్రీనివాస్, సింగు రాంబాబు, సోమయ్య తదితరులు ఉన్నారు.

ఎస్‌బీఐ శాఖను తరలించొద్దు

మిర్యాలగూడ : అవంతీపురం ఎస్‌బీఐ శాఖను తరలించొద్దని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు కోరారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ పాత మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అవంతీపురానికి తరలించిన తర్వాత వ్యాపారుల ప్రయోజనం కోసం ఎస్‌బీఐ బ్యాంక్ వారు మార్కెట్ ఆవరణలో 12 ఏళ్ల క్రితం శాఖను ఏర్పాటు చేశారని తెలిపారు. ఇది చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మార్కెట్ నుంచి ఎస్‌బీఐ శాఖను మిర్యాలగూడకు తరలించవద్దని, ఆలగడప లేదా అవంతీపురంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల సత్యనారాయణచౌదరి, ఇంద్రపల్లి బుచ్చిబాబు, గోవిందరెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి

మిర్యాలగూడ టౌన్ : క్రీడలు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. ధర్మానాయక్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌తో పాటు క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితుడిని శిక్షించాలి



కొవ్వత్తుల ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

మిర్యాలగూడ అర్బన్: మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మిర్యాలగూడ ఐఎంఏ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలో కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జీవన జ్యోతి, సరిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు సాగు కష్టాలు

- రుణాల కోసం తప్పని ఇక్కట్లు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న కొందరు కౌలు రైతులు
- సాగు భారం అవుతోందని ఆవేదన



హాలియాలో పంటసాగు చేసేందుకు గొర్రు తోలుతున్న కౌలు రైతు

హాలియా : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కౌలు రైతులకు సాగు కష్టాలతో సతమతమవుతున్నారు. పెట్టుబడి రుణాలు లేక సాగు భారమైందని వాపోతున్నారు. కౌలు రైతులకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2015లో రుణ అర్హత కార్డు (ఎల్‌ఈసీ)లను జారీ చేసి, ఆ తర్వాత పట్టించుకోలేదు.

అందరికీ అందని పంట రుణాలు

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కౌలు రైతులకు సంబంధించి అధికారిక లెక్కలు ఏమీ లేవు. ప్రభుత్వం కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసిన 2015లో నియోజకవర్గంలో సుమారు 16వేల మందికిపైగా ఉండగా వారిలో కేవలం 600 మందికి మాత్రమే రుణ అర్హత కార్డులు అందించారు. వారిలో 50 మందికి మాత్రమే రూ.16.50 లక్షల పంట రుణాలను అందజేశారు. ప్రతి ఏడాది వ్యవసాయ భూములను కౌలుకు తీసుకుని పంటలను సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతూనే ఉన్నప్పటికీ ప్రభుత్వం వారి గురించి ఆలోచన చేయడం లేదు.

ప్రైవేట్ వ్యాపారులే దిక్కు

ప్రతి సీజన్‌కు పంట రుణాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో కౌలు రైతులంతా పంటల సాగుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోవైపు వ్యవసాయ పెట్టుబడులు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. సాధారణ రైతు ఎకరంలో వరి సాగు చేయాలంటే కనిష్ఠంగా రూ.33 వేలు ఖర్చు అవుతుంది. కౌలు రైతు అయితే అదనంగా రూ. 20 నుంచి రూ.30వేలు కౌలు చెల్లించాలి కనుక..ఎకరానికి రూ. 55వేలు పెట్టుబడి ఖర్చు వస్తుంది.

ఆదుకోని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా రైతులకు అందించే పెట్టుబడి సాయం ఎకరానికి రూ. 15వేలతో పాటు పంటరుణాలు, పంట నష్టపరిహారాలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు వంటి ప్రయోజనాలను కూడా తాము పొందలేకపోతున్నామని కౌలు రైతులు వాపోతున్నారు. వడ్డీలకు తెచ్చి పంట సాగుచేయగా..పంటలు దెబ్బతిని అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కౌలు రైతులు వాపోతున్నారు.

సాగు కష్టతరమైంది



పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పంటలసాగు కష్టతరంగా ఉంది. గతేడాది కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేయగా గిట్టుబాటు ధర లేక నష్టం వాటిల్లింది. బ్యాంకులు రుణాలు ఇవ్వక వడ్డీకి తెచ్చి పంటను సాగు చేస్తే అప్పులే మిగిలాయి. ప్రభుత్వం, బ్యాంకులు పంట రుణాలు అందించాలి.

–బాసిపాక రాజు, కౌలు రైతు, త్రిపురారం

ఆచరణలో విఫలం



కౌలు రైతులకు పంటల సాగుకు వేలాది కోట్లు రుణాలుగా అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. ప్రభుత్వం చెప్పేదానికి..బ్యాంకర్లు చెప్పేదానికి పొంతన లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌలు రైతులకు సకాలంలో రుణాలను అందించి ఆదుకోవాలి.

–షేక్ సైదావలి, కౌలు రైతు, రాజన్నగూడెం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాతేజ రైస్ మిల్ ఆధ్వర్యంలో 250 మొక్కలను ఎమ్మెల్యే నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్ల వర్షాలు సరిగా పడక సమస్త జీవకోటి ఇబ్బందులకు గురవుతుందన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

స్వాతంత్ర్య వేడుకలను గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నందున ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వంద అడుగుల జాతీయ పతాక స్థూపం నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పాలసీ చేయించుకోవాలి

ప్రతి వ్యక్తి జీవిత బీమా పాలసీ చేయించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ధనావత్ రవీంద్ర నాయక్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2022లో సంవత్సరానికి రూ.3,27,041 చెల్లించాడు. రెండేళ్లు కట్టిన అనంతరం ఆకస్మికంగా మృతిచెందడంతో అతని కుటుంబానికి మంజూరైన రూ.61.20లక్షల విలువగల చెక్కును మంగళవారం మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందచేశారు. కార్యక్రమంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నరేందర్, డీఎం రాజిరెడ్డి, ఏజెంట్ పాలుట్ల బాబయ్య పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి : ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని చింతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమావత్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కారణాలత చేత చదువు మధ్యలో మానేసిన వారు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ కోసం మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, టి.సితో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సుంకిశాలను సందర్శించిన బీజేపీ బృందం



పరిశీలిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేల బృందం

పెద్దవూర: మండలంలోని పాల్తీతండా సమీపంలోని సుంకిశాల గుట్టపై నిర్మిస్తున్న జంటనగరాలకు తాగునీటిని అందించే సుంకిశాల ప్రాజెక్టు పంప్ హౌజ్‌ను మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. సాగర్ జలాశయంలో డెడ్‌స్టోరేజీలో నీటిమట్టం ఉన్నా జంటనగరాలకు తాగునీరు అందించేందుకు రూ.2221 కోట్లతో చేపడుతున్న సుంకిశాల తాగునీటి ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్‌లోకి నీరు వచ్చి రిటైనింగ్ వాల్ పడిపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సిర్పూరు, ముథోల్ బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్‌బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజు, మదగోని శ్రీనివాస్‌గౌడ్, పాల్తీ శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పూజలు

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కనే షిర్డీ సాయినాథున్ని మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ సుంకిశాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తూ మార్గమధ్యలో సాయినాథుని దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరి వెంట నాయకులు నరేష్‌యాదవ్, రామారావు, హరీష్‌రావు తదితరులున్నారు.

మెనూ చార్జీలు పెంచాలని ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న సైదులు తదితరులు

హాలియా : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల వేతనం పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి నేడు కేంద్రీకృత వంటశాల వైపు మొగ్గుచూపుతుందని విమర్శించారు. 24 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులందరినీ రెగ్యూలరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మమ్మ, రామలింగమ్మ, ఇద్దమ్మ, కమలమ్మ, నాగలక్ష్మి, అంజమ్మ ఉన్నారు.

గంజాయి సాగు చేపడితే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగమణి

వేములపల్లి: రైతులు తమ పొలం గట్ల వెంట గంజాయి సాగు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పోరెడ్డి నాగమణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గంజాయి సేవించడం వల్ల యువత తమ భవిష్యత్తును పాడు చేసుకుంటుందన్నారు. యువత గంజాయికి దూరంగా ఉండి తాము అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. గంజాయి సాగు చేపడితే ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు అందవని, కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ రుషేంద్రమణి, ఏఈఓలు నితిన్, సంతోష్, మల్సూర్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తిరుమలగిరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీను నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్.శ్రీనునాయక్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాలపై అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ శ్రీను నాయక్, అంజి నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయిని తరిమేద్దాం

అడవిదేవులపల్లి : గంజాయిని తరిమేద్దామని మండల వ్యవసాయ అధికారి సైదానాయక్ అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో అధికారులు, రైతులు, యువకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. గంజాయిని తరిమేందుకు యువత సిద్ధం కావాలన్నారు. గంజాయి ఆనవాళ్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు–8712670266కు సమాచారం ఇవ్వాలన్నారు.


మాదక ద్రవ్యాలపై అవగాహన

చింతపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీను నాయక్, ఏఎస్‌ఐ చంద్రారెడ్డి మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనార్థాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణకుమారి, ఏఈఓ నర్సింహ, మధు, హనుమ, మాధురి, శ్రీలత, మౌనిక పాల్గొన్నారు.

మత్తుతో జీవితాన్ని చిత్తు చేసుకోవద్దు

పెద్దవూర: గంజాయి వంటి మత్తు పదార్థాలను స్వీకరించి జీవితాలను చిత్తు చేసుకోవద్దని మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ సువర్ణకుమారి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మీ, వెంకటమ్మ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ కాల్వలకు నీరు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : ఏఎమ్మార్పీ కాల్వలకు వెంటనే నీటిని విడుదల చేయాలని కోరుతూ నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నియోజకవర్గంలోని నల్లగొండ, తిప్పర్తి, కనగల్, మాడుగులపల్లి మండలాల్లో రైతాంగానికి సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగర్ నిండి వందల టీఎంసీల నీరు వృథాగా పోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదన్నారు. నారుమళ్లు ఎండిపోతున్నా జిల్లాకు చెందిన మంత్రులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బక్క పిచ్చయ్య, కరీంపాషా, నారబోయిన భిక్షం, బొజ్జ వెంకన్న, యాదగిరి, తుమ్మల లింగస్వామి, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రీ పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- మిర్యాలగూడలో జాతీయ జెండాలతో భారీ ప్రదర్శన



మిర్యాలగూడ: ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



హాలియా: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ కోరారు. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో రెండు వేల మంది విద్యార్థులు జాతీయ జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముందుగా జాతీయ గీతాన్ని ఆలపించిన ఆ తర్వాత సత్యనారాయణ మాట్లాడారు. అరాచక శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, చిలుకూరి శ్యాం, కొండేటి సరిత, ఎడ్ల రమేష్, బంటు సైదులు, సీతారాంరెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

దేవరకొండ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నరసింహ కోరారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ భావం చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, మాతంగి ప్రేమ్, వస్కుల సుధాకర్, బాలాజీ నాయక్, మల్లేష్‌నాయక్, నేతాళ్ల వెంకటేష్, పబ్బు సైదులు, భాస్కర్, అంజినాయక్, శంకర్ ఉన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో ర్యాలీ

హాలియా : ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం హాలియాలో హర్ ఘర్ తిరంగా నినాదంతో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రామాలయం నుంచి సాగర్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బీజేవైఎం యువ మోర్చా సాగర్ నియోజకవర్గ కన్వీనర్ కడియం సైదులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చెన్ను వెంకట నారాయణ రెడ్డి, మెండె అనిల్‌కుమార్ యాదవ్, భాస్కర్‌నాయక్, బాలాజీ నాయక్, రవి చౌదరి ఉన్నారు.

విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ కోఆర్డినేటర్‌కు సన్మానం



భాషానాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : దేవరకొండ పట్టణంలో విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ కోఆర్డినేటర్ లావుడ్య భాషానాయక్‌ను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ చొల్లేటి భాస్కరాచారి, కూరెళ్ల కృష్ణచారి, చేరుపల్లి విజయలక్ష్మి, కొర్ర కిషన్‌నాయక్, బ్రహ్మచారి, కూరెళ్ల రామకృష్ణచారి పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు

చందంపేట : నేరెడుగొమ్ములోని 17వ నంబర్ రేషన్ దుకాణాన్ని మంగళవారం దేవరకొండ పౌరసరఫరాల శాఖ అధికారి హనుమంతు శ్రీనివాస్ గౌడ్ తనిఖీ చేశారు. 7 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి సదరు రేషన్ షాపు బాధ్యతలను కొత్తపల్లి రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

ప్రసవాలు, చిన్నారుల చికిత్సపై దృష్టి సారించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రసవాలు, చిన్నపిల్లల చికిత్సపై ఈనెల 15నుంచి వైద్యఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జ్వర సర్వేపై జిల్లా వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సంబంధిత గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి జ్వర సర్వే చేయాలన్నారు. 15నుంచి ఎంపిక చేసిన దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించేందుకు పైలెట్ పద్ధతిన మోడల్ ఆస్పత్రులుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ మాతృనాయక్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు కరీమున్నీసా కోరారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పథకం నిర్వహణను హరేరామా హరే కృష్ణ సంస్థకు అప్పగించాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మ మ్మ, ధీరావత్ సరోజా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

దేవరకొండ: కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని కొమ్మేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ సహకారంతో సమకూర్చిన నోట్‌బుక్స్, స్కూల్‌బ్యాగ్స్, మహనీయుల చిత్రపటాలను ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో తోటపల్లి మల్లేష్, ప్రేమయ్య, ధనరాజ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పాస్ తప్పనిసరిగా అమలు చేయాలి



పెద్దవూరలోని ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతినిర్మల

పెద్దవూర: ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకే ఈ–పాస్ యంత్రాల ద్వారా కాంప్లెక్స్ ఎరువులను విక్రయించాలని హాలియా ఏడీఏ శాంతినిర్మల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్‌లు, ఈ–పాస్ యంత్రాల పనితీరు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణదారులు ఈ–పాస్ యంత్రాన్ని తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. దుకాణాల్లో కాలం చెల్లిన క్రిమిసంహారక మందులు, కాంప్లెక్స్ ఎరువులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం ఆమె మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సందీప్, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

త్రిపురారం : మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలగాని రామచంద్రయ్య గౌడ్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి వేర్వేరుగా లక్ష్మీపురంలో మృతుడికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కేశబోయిన జానయ్య, కృష్ణ, మారయ్య, దోరెపల్లి వెంకటేశ్వర్లు, శ్రీధర్, తెనాలి సుధాకర్‌రెడ్డి, అనుముల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మిర్యాలగూడ: నియోజకవర్గ వ్యాప్తంగా 41మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి పంపిణీ చేశారు.మంగళవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఎమ్మెల్సీ కార్యాలయంలో మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన 41 మంది అనారోగ్యానికి గురై వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన రూ. 14,40,500 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హిందూ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



మిర్యాలగూడ పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : బంగ్లాదేశ్‌లో హిందూవులు, ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మంగళవారం రాత్రి హిందూవాహిని, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపులోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి రాజీవ్‌చౌక్ వరకు కొవ్వొత్తులు, కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ పౌరులు భారతదేశంలో చొరబడి అక్రమంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇకనైనా మేలుకొని హిందూవుల కోసం పని చేసేవారికి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కరుణాకర్, గూడూరు శ్రీనివాస్‌రావు, గంజి సుధాకర్, కిరణ్, వెంకటేశ్వర్ రెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తం రెడ్డి, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరి శ్యాం, దాసరాజు శివ, చిల్లంచర్ల అభిరామ్, నవీన్, సీతా రాంరెడ్డి, అఖిల్, విక్రమ్ పాల్గొన్నారు.